ప్రశ్నిస్తే దాడులా?

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌కు నోటీసులు అందజేస్తున్న పోలీస్

మన్నె క్రిశాంక్‌కు నోటీసులు

- 9,10 తేదీల్లో విచారణకు రావాలని గచ్చిబౌలి పోలీసుల సూచన
- కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటా : క్రిశాంక్

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ ఘటనపై సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేశారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌కు గచ్చిబౌలి పోలీసులు సోమవారం నోటీసులు అందజేశారు. ఈ నెల 9,10 తేదీల్లో విచారణకు హాజరుకావాలని సూచించారు. కాగా, పోలీసులు అందజేసిన నోటీసులపై మన్నె క్రిశాంక్ స్పందించారు. విచారణకు సహకరిస్తానని, కేసులను లీగల్‌గా ఎదుర్కొంటానని ప్రకటించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తనపై 21 అక్రమ కేసులు బనాయించిందని తెలిపారు. హెచ్‌సీయూ ఘటనకు సంబంధించి విడుదల చేసిన వీడియోలన్నీ వాస్తవమేనని అన్నారు. ఎక్కడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వీడియోలు వాడలేదని స్పష్టంచేశారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా ప్రభుత్వ అక్రమాలు, దుర్మార్గాలపై ప్రశ్నించడం ఆపబోనని తేల్చిచెప్పారు.

'సైబర్' అటాక్!

ప్రశ్నించిన వారిపై ఐటీయాక్ట్ కింది కేసులు

- కానిస్టేబుళ్లతోనే ఫిర్యాదు చేయిస్తున్న సీఎస్‌బీ
- నేరగాళ్లను వదిలి బీఆర్ఎస్‌పై నిఘా
- సీఎస్‌బీకి రాజకీయ మకిలీ
- ఎఫ్ఐఆర్‌లు రాసేందుకే ఎస్ఐ స్థాయి సిబ్బంది పరిమితం
- మార్చి 16న ఒక్కరోజే 9 కేసులు
- ఏడాదిలో రూ.1,866 కోట్ల ప్రజాధనం వృథా?
- రాజకీయ కక్ష సాధింపులకు ఊతం

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : రాజకీయ కక్షసాధింపులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన విడిచి.. 'సైబర్' అటాక్ చేస్తున్నది. ప్రభుత్వ వ్యవస్థలను రాజకీయ స్వలాభం కోసం వాడుకుంటున్నది. ఇందులో ఒకటి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)! అసలు లక్ష్యాన్ని విడిచిపెట్టి రాజకీయ కక్షసాధింపు ఎజెండానే అమలు చేయాలని సీఎస్‌బీపై ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్న ట్టు తెలిసింది. ఈ క్రమంలోనే మార్చి 16న ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా ఆయా స్టేషన్ల పరిధిలోని సైబర్ సెక్యూరిటీ బ్యూరో కానిస్టేబుళ్లతో కేసులు పెట్టించింది.

దేశానికే గర్వకారణంగా సీఎస్‌బీ

నోట్లరద్దు తర్వాత దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ పేమెంట్ సేవలు పెరిగిపోయాయి. వాటితోపా టే దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు కూడా విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్ల దృష్టి తెలంగాణపై, ముఖ్యంగా హైదరాబాద్‌పై పడిందని ఇంటెలిజెన్స్ ద్వారా తెలుసుకున్న నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, సైబర్ నేరాలను అరికట్టేందుకు దేశంలోనే తొలిసారిగా 'తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో'ను 2023, మే 31 ఏర్పాటు చేశారు. ఆ విభాగానికి సుమారు 500 మంది సిబ్బందిని, నిధులను, టెక్నాలజీ ఆధారిత సామగ్రిని సమకూర్చి అడిషనల్ డీజీ స్థాయి అధికారిని డైరెక్టర్‌గా నియమించారు. ఆ సంస్థ దేశంలో సైబర్ నేరాల తీరును విశ్లేషించి, ప్రజలకు అవగాహన కల్పిస్తూ సొమ్ము ను కాపాడటంతో అతి కొద్ది

కాలంలోనే దేశానికి రోల్‌మాడల్‌గా నిలిచింది.

కాంగ్రెస్ పాలనలో రాజకీయ మకిలీ

ఎంతో మహోన్నతమైన వ్యవస్థగా రూపుదిద్దుకున్న సీఎస్‌బీకి కాంగ్రెస్ పాలనలో రాజకీయ మకిలీ అంటింది. 16 నెలల పాలనపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సర్కారు వద్ద మార్గం లేక ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టిస్తున్నది. సీఎస్‌బీలో పని చేస్తున్న కానిస్టేబుళ్లను బలిపశువులను చేస్తున్నది. సోషల్‌మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు, కామెంట్లు పెట్టేవారిపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో కానిస్టేబుళ్ల ద్వారా దృష్టి పెట్టించింది. ఆ కానిస్టేబుళ్లతోనే వారిపై కేసులు పె ట్టించి.. జైళ్లకు పంపే ఏర్పాట్లు చేస్తూ సీఎస్‌బీని దుర్వినియోగం చేస్తున్నది.

ఏం చేయాలి?.. ఏం చేస్తున్నారు?

సైబర్ మోసాలపై దృష్టిపెట్టాల్సిన సీఎస్‌బీ అధికారులు 'ఈ రోజు బీఆర్ఎస్‌కు చెందిన ఏ కార్యకర్తపై కేసు పెడదామా?' అని ఎదురుచూస్తున్నట్టుగా ఉన్నది. వాట్సాప్, సోషల్ మీడియా ప్రొఫైళ్లను తనిఖీ చేసే అధికారంతో ఒక పార్టీకి చెందిన వారి ఖాతాలపైనే దృష్టిపెడుతున్నారు. కొరియర్, నకిలీ కస్టమర్ కేర్, సెక్స్‌టార్షన్, రుణ, కేవైసీ, ప్రకటనల మోసాలను, నకిలీ సోషల్ మీడియా ప్రొఫైళ్లను పసిగట్టి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన వాళ్లు.. ఆ పనులను పక్కనబెట్టి, బీఆర్ఎస్ యాక్టివిస్టుల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తున్నారు.

వేలకోట్లతో ఘనకార్యం!

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అసలు పని పక్కనపెట్టి.. కొసరు పనిపైనే దృష్టి పెడుతుండటంతో రాష్ట్రంలో సైబర్ నేరాల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2023లో 17,571 సైబర్ క్రైమ్ కేసులు నమోదైతే 43.33 శాతం పెరుగుదలతో 2024లో 25,184 నమోదయ్యాయి. రాష్ట్రంలో సుమారు 1.14 లక్షల మంది సైబర్ మోసాల బారిన పడ్డారు. ఒక్క సంవత్సరంలోనే రూ.1,866 కోట్లను పోగొట్టుకున్నారు. ఇలాంటి వాటిపై దృష్టి పెట్టాల్సిన టీజీసీఎస్‌బీని ప్రభుత్వం కక్ష రాజకీయాలకు ఆయుధంగా వాడుకుంటున్నదనే విమర్శ లు వెల్లువెత్తుతున్నాయి.

మార్చి 16న ఒక్కరోజే నమోదైన కేసులు

ఎఫ్ఐఆర్	ఫిర్యాదుదారు	స్టేషన్
20/2025	కిశోర్, కానిస్టేబుల్	సైబర్‌క్రైమ్, వరంగల్
9/2025	శ్రీనివాస్, కానిస్టేబుల్	సైబర్‌క్రైమ్, రామగుండం
7/2025	ప్రవీణ్, కానిస్టేబుల్	సైబర్‌క్రైమ్, సిద్దిపేట
6/2025	ప్రవీణ్, కానిస్టేబుల్	సైబర్‌క్రైమ్, సిద్దిపేట
6/2025	కృష్ణప్రసాద్, కానిస్టేబుల్	సైబర్‌క్రైమ్, ఖమ్మం
7/2025	కృష్ణప్రసాద్, కానిస్టేబుల్	సైబర్‌క్రైమ్, ఖమ్మం
8/2025	సతీశ్, కానిస్టేబుల్	సైబర్‌క్రైమ్, రామగుండం
14/2025	శ్రీనివాస్, కానిస్టేబుల్	సైబర్‌క్రైమ్, నిజామాబాద్
13/2025	వసీం అక్రమ్, కానిస్టేబుల్	సైబ్‌క్రైమ్, కరీంనగర్

హెచ్‌ఆర్సీ చైర్మన్, లోకాయుక్త నియామకాల్లో నిబంధనలకు తూట్లు

గవర్నర్‌కు సామాజిక వేత్తల లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ), లోకాయుక్తల నూతన పాలకవర్గం నియామకం నిబంధనల ప్రకారం జరగలేదని సామాజిక కార్యకర్తలు బుర్ర శ్రీనివాస్, గుడిచుట్టు రామనాథం ఆరోపించారు. ప్రభుత్వం పంపించిన ఈ ఫైల్‌ను తిప్పి పంపాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గవర్నర్‌కు ఆదివారం వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ప్రభుత్వం ప్రకటించిన గడువులోగా దరఖాస్తు చేసుకోకున్నా చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఎంపిక చేశారని అందులో ప్రస్తావించారు. అదే విధంగా తెలంగాణ లోకాయుక్త నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వకుండానే జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డిని నియమించడం నిబంధనలు పాటించకపోవడమేనని పేర్కొన్నారు. దీనిపై ఎన్నో అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని లేఖలో గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి అర్హులను ఆయా పదవుల్లో నియమించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కొత్తగడి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

వికారాబాద్ కలెక్టర్‌ను అదేశించిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్

వికారాబాద్, ఏప్రిల్ 7 : ఎస్సీ,ఎస్టీ బాలికలను కులం పేరుతో దూషించి దాడి చేసిన వికారాబాద్ జిల్లా కొత్తగడి సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలతను సస్పెండ్ చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సోమవారం వికారాబాద్ కలెక్టర్ ను ఆదేశించారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్, మానవ హక్కుల వేదిక, ఎంవీ ఫౌండేషన్ సంస్థలు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయగా చైర్మన్ స్పందించారు. వికారాబాద్ కలెక్టర్‌కు ఫోన్ చేసి బాలికలపై దాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు.

కంజుపిట్టకు చికిత్స చేయిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

పక్షి ప్రేమను చాటుకున్న ఎమ్మెల్సీ గోరటి

గాయపడిన కంజుపిట్టకు చికిత్స చేయించిన వెంకన్న

పరిగి, ఏప్రిల్ 7 : ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పక్షి ప్రేమను చాటుకున్నారు. గోరటి నారాయణపేట జిల్లా మద్దూరు పర్యటన నుంచి సోమవారం హైదరాబాద్ తిరిగి వస్తున్న సమయంలో ఓ వేటగాడు కంజుపిట్టను పట్టుకొని వెళ్తుండగా తన వాహనం ఆపి అతడికి రూ.150 ఇచ్చి కంజుపిట్టను కొనుగోలు చేశారు. అడవిలో వదిలేద్దామని చూడగా కాలికి గాయం కనిపించింది. దీంతో వికారాబాద్ జిల్లా పరిగి మండలం గడిసింగాపూర్ పశువైద్య కేంద్రానికి కంజుపిట్టను తీసుకొని వెళ్లి వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ సతీష్‌కుమార్‌తో వైద్యం చేశారు. కంజుపిట్ట కోలుకున్న తర్వాత మద్దూరు సమీపంలోని అడవిలో వదిలిపెడతానని వెంకన్న తెలిపారు.

పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్త (ఫైల్)

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై దాడికి దిగిన కాంగ్రెస్ శ్రేణులు (ఫైల్)

కాంగ్రెస్ సర్కార్.. రక్తచరిత్ర

- ఏడాదిలోనే ముగ్గురు బీఆర్ఎస్ కార్యకర్తల హత్య
- సల్వాజీ మాధవరావుపై 4 సార్లు హత్యాయత్నం
- కేటీఆర్, హరీశ్‌రావు సహా శ్రేణులపైకి మూకలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపైనా దాడి
- రాష్ట్రంలో గులాబీ కార్యకర్తలపై దాడులకే లెక్కేలేదు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : 'ఇప్పుడు ఆలోచన చేసి.. ఓ మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోకపోతే.. తెలంగాణను మళ్లీ కుక్కలు చింపిన విస్తరి చేస్తరు. శాంతిభద్రతలు అదుపు తప్పుతయి. రౌడీ మూఖలు రాజ్యమేలుతయి. హత్యలు పెరుగుతయి' అని నాడు ఎన్నికల సమయంలో కేసీఆర్ చెప్పిన మాటలు నేడు అక్షరసత్యంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పదినెలల పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పడమే కాకుండా రాజకీయ ప్రేరేపిత హత్యలు తెలంగాణలో తొలిసారిగా నమోదవడం కలకలం సృష్టిస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలలు కాగా ఏడాదిలోనే ముగ్గురు బీఆర్ఎస్ కార్యకర్తలను దారుణంగా చంపారు.

సీఎం ఉమ్మడి జిల్లాలోనే తొలిహత్య

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్ నుంచే రాజకీయ హత్యలు మొదలయ్యాయి. కొన్నేండ్ల పాటు దేశానికి జవాన్‌గా సేవ చేసి, బీఆర్ఎస్‌లో కీలక పాత్ర పోషించిన కొల్లాపూర్ నియోజకవర్గం పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లికి చెందిన మల్లేశ్ యాదవ్‌ను 2023, డిసెంబర్ 28న దారుణంగా పొడిచి చంపారు. మల్లేశ్‌యాదవ్ హత్యను మరువక ముందే 2024, మే 23న అదే జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మిపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డిని అర్ధరాత్రి 12 గంటల తర్వాత కరెంటు తీసేసి మరీ గొడ్డళ్లతో కిరాతకంగా నరికి చంపారు. 10 నెలలైనా ఈ హత్యకు కారకులెవరో తేల్చలేదు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోలీసులకు వి న్నవించినా తాత్సారం చేస్తున్నట్టు తెలుస్తున్నది.

ఖమ్మంలో భూతగాదాలను సాకుగా చూపి..

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం శివాయిగూడెంలో భూ వివాదాల ముసుగులో అధికార కాంగ్రెస్ నాయకులు ఈర్యా నాయక్ అనే బీఆర్ఎస్ కార్యకర్తను హత్య చేశారు. ఈ ఘటన నిరుడు జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావం రోజున జరిగింది. శివాయిగూడేనికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త తేజావత్ హతీరాం.. కోయచలక రెవెన్యూ పరిధిలోని తన ఎకరం అసైన్డ్ భూమిని అదే గ్రామానికి చెందిన లాల్‌సింగ్ (బీఆర్ఎస్ కార్యకర్త)కు విక్రయించాడు. అసైన్డ్ భూమి కావడంతో తాను అమ్మిన భూమిని తిరిగి ఆక్రమించుకోవాలని హతీరాం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య బాలాజీని ఆశ్రయించాడు. దీనిపై బాలాజీ చర్చలకు తమ ఇంటికి రావాలని లాల్‌సింగ్‌ను ఆదేశించాడు. తనకు అన్యాయం జరుగుతున్నదని భావించిన లాల్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో లాల్‌సింగ్‌కు అనుకూలుడైన సీఆర్పీఎఫ్ జవాన్ మాలోతు రవి బయటకు వెళ్లి వస్తుండగా కాంగ్రెస్ కార్యకర్తలు బానోతు దశరథ్, బానోతు రమేశ్, భూక్య బాలాజీ, విజయ్, ఉమ కలిసి అతడిపై దాడి చేశారు. అడ్డుగా వచ్చిన రవి భార్యను అందరి ముందే వివస్త్రను చేశారు. రవిపై దాడి చేస్తుండటాన్ని గమనించిన అతడి పెద్దనాన్న తేజావత్ ఈర్య అలియాస్ పాప (55) (గ్రామ బీఆర్ఎస్ మాజీ ఉప సర్పంచ్) అడ్డుకోగా.. కాంగ్రెస్ కార్యకర్త తేజావత్ దశరథ్ అతడి ఛాతీపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

నిరుడు మార్చి 30న ములుగు జిల్లా ములుగు మండలం ఇంచర్ల గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు మామిడి అశోక్‌పై కత్తితో దాడి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు శానబోయిన అశోక్ (ఫైల్)

అధికారంలోకి వచ్చీ రావడంతోనే..

అధికారంలోకి వచ్చీరాగానే కాంగ్రెస్ నాయకులు సూర్యాపేట జిల్లాలో ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపారు. అకారణంగా జాజిరెడ్డిగూడెం మండలం కోమటిపల్లి, కాసర్లపహాడ్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. అడ్డగోలుగా ఆస్తులు ధ్వంసం చేశారు. తుంగతుర్తిలో ఇప్పటికీ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లిలో కూడా కావాలనే కాంగ్రెస్ నేతలు గొడవకు దిగి పెద్ద రాద్ధాంతానికి తెరలేపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట రూరల్ మండలంలోని దుబ్బతండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కిరణ్‌పై అదే తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు దాడి చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి మండలం, గండిపేట్‌లో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు భీమ్‌దాస్.. హైమద్, రజాక్, జావేద్ అనే బీఆర్ఎస్ కార్యకర్తలపై కత్తితో పొడవడంతో గాయపడ్డారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో హత్యకు గురైన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

నాలుగు సార్లు హత్యాయత్నం

పెద్దపల్లి జిల్లాలో 4 నెలల వ్యవధిలోనే సల్వాజీ మాధవరావుపై 4 సార్లు హత్యాహత్యానికి పాల్పడ్డారు. తనపై కాంగ్రెస్ నాయకులు హత్యా యత్నానికి పాల్పడ్డారని నెత్తుటి మరకలతో పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన సల్వాజీ మాధవరావుపైనే పోలీసులు ఉల్టా అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలు పాలు చేశారు. రాజకీయ ప్రేరేపిత దాడుల్లో బాధితులైన వారిలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్, సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కాసర్లపహాడ్‌కు చెందిన మెండె సురేశ్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, ఖమ్మం జిల్లా కామేపల్లి మండలానికి చెందిన చల్లా హరి, దనియాకుల హన్మంతరావు, నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం జొన్నలబోగుడకు చెందిన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అనుచరులు, రాత్లావత్ మంగమ్మ, కార్పొరేటర్ దేదీప్యారావు ఉన్నారు.

ప్రతిపక్ష నేతలకు భద్రత కరువు

రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష నేతలు, బీఆర్ఎస్ కార్యకర్తలపై ఎక్కడో ఓ చోట కాంగ్రెస్ గూండాల దౌర్జన్యం కనిపిస్తూనే ఉన్నది. నాటి బీఆర్ఎస్ ఎంపీ, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై ఎంపీ ఎన్నికల ప్రచారంలోనే కాంగ్రెస్‌కు చెందిన కార్యకర్త హత్యాయత్నం చేశాడు. త్రుటిలో తప్పించుకున్న ప్రభాకర్‌రెడ్డి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. హైడ్రా బాధితుల పక్షాన మాట్లాడేందుకు వెళ్తున్న మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ని కాంగ్రెస్ గూండాలు అడ్డుకోవడం చర్చనీయాంశమైంది. సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి, నల్లగొండలో బీఆర్ఎస్ నేతలు, రైతులు చేస్తున్న ధర్నాపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి, ఖమ్మంలో వరద బాధితులను ఆదుకునేందుకు వెళ్తే అక్కడ కూడా హరీశ్‌రావు బృందంపై దాడి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి తెగబడినా పోలీసులు పట్టనట్టు వ్యవహరించడంపై విమర్శలున్నాయి.

అర్ధరాత్రి దాడులు

నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో కాంగ్రెస్ కార్యకర్తల అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందడంతో మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పల్లెమోనికాలనీలో బీఆర్ఎస్ సర్పంచ్ వెంకటమ్మ భర్త పెద్ద వెంకన్నపై అకారణంగా దాడిచేశారు. ఈ దాడిలో బీఆర్ఎస్ కార్యకర్త ఆంజనేయులు తలకు గాయాలయ్యాయి. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగవట్నంలో బీఆర్ఎస్ కార్యకర్తలు శివ, బాలపీరు, రాముడు కారుపైకి రాళ్లు విసిరి, రాళ్ల దాడికి పాల్పడ్డారు. పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌లో పోలింగ్ ముందు రోజు రాత్రి కత్తిపోటుకు గురైన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు గుజ్జుల పరమేశ్ ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. దేవినేనిపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు మల్లేశ్ (ఎంపీటీసీ భర్త) ఇంటిపై దాడిచేశారు. కురుమ కులానికి చెందిన భార్యాభర్తలను కొట్టడంతో పాటు వాల్మీకి కార్యకర్త ఇంటిపైనున్న ప్లాస్టిక్ కవర్‌కు నిప్పుపెట్టారు. నల్లగొండ మున్సిపాలిటీలోని 16వ వార్డు కౌన్సిలర్ భర్త జేరిపోతుల భాస్కర్ గౌడ్, తన సోదరులు, కార్యకర్తలు కలిసి మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి ఇంటి ముందు హంగామా చేశారు.

హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ శ్రేణుల దాడితో భయాందోళనతో రోదిస్తున్న మహిళ (ఫైల్)

జోగిపేటలో కాంగ్రెస్ శ్రేణుల దాడుల్లో గాయపడిన బీఆర్ఎస్ నేత యశ్వంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ (ఫైల్)

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా నియమితులైన డీవీఎన్ రెడ్డిని సన్మానిస్తున్న సీనయ్య, ఎస్ఎన్ రెడ్డి తదితర ప్రముఖులు

రాష్ట్రంలో పనిచేసే పరిస్థితి లేదు

మొదటిపేజీ తరువాయి...

చేశారు. తాము కార్పొరేట్ కాంట్రాక్టర్లకు వ్యతిరేకం కాదని, చిన్న కాంట్రాక్టర్లు తమ కార్యాలయాల్లో సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొన్నదని, బిల్లులు రాక కార్యాలయాల్లో దీక్షలు చేసే పరిస్థితి వచ్చిందని వాపోయారు. అఫ్ఘనిస్తాన్‌లోనైనా కాంట్రాక్టర్లు సులువుగా పని చేసుకొనే పరిస్థితి ఉన్నదని, ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు సరిగా చేయకుంటే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని చూస్తున్నారు తప్ప పెండింగ్ బిల్లులు రాక కాంట్రాక్టర్లు పడుతున్న బాధలను అర్థం చేసుకోవడం లేదని వాపోయారు. రూ.కోటిలోపు ఉన్న బిల్లులను క్లియర్ చేస్తామని స్వయంగా సీఎం చెప్పినా ఆ దిశగా అడుగులు వేయడం లేదని చెప్పారు. తమ సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్న కాంట్రాక్టర్లు ఇక పనులు చేసే పరిస్థితి లేదని, త్వరలోనే కాంట్రాక్టులను ఆపేస్తామని, ఆ దిశగా ఓ తేదీని ప్రకటిస్తామని హెచ్చరించారు.

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా నియమితులైన డీవీఎన్ రెడ్డిని ఈ సందర్భంగా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. బీఏఐ మాజీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా సేవలందించిన సీనయ్య, ఎస్ఎన్‌రెడ్డిలను సైతం బీఏఐ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో బీఏఐ హైదరాబాద్ సెంటర్ చైర్మన్ సల్లా శ్రీనివాస్‌రావు, వివిధ సెంటర్ల చైర్మన్లు, బిల్డర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో దుగోడ యంత్రం వంక బీనంగా, ఉద్వేగంగా చూస్తున్న వడ్రంగి దేవేందర్

దుగోడ మూగబోయింది!

- మళ్లీ గల్ఫ్ గమ్యమవుతున్నది
- కుప్పకూలిన నిర్మాణ రంగం
- ఆరునెలలుగా పనిలేక వడ్రంగి యాతన
- తప్పని పరిస్థితిలో ఉపాధి కోసం గల్ఫ్ బాట

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: వ్యవసాయం, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం ఒకదానితో ఒకటి ముడిపడిన రంగాలు. ప్రస్తుత ప్రభుత్వ అనాలోచిత చర్యలతో ప్రతి రంగం కుదేలైంది. దీంతో కార్మికులు, వృత్తిదారులు, యువకులు తిరిగి గల్ఫ్‌బాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వడ్రంగి కొడిమోజు దేవేందరే ఉదాహరణ. ఏడేండ్లుగా చేతినిండా వృత్తి పనితో సంతోషంగా గడిపిన దేవేందర్‌కు భార్య లహరి, ఇద్దరు పిల్లలు సాత్విక్, సుచిత్ ఉన్నారు. పిల్లలను ఉన్నంతలో ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తూ ఉన్న ఊళ్లో సంతోషంగా బతకాలని కలలుగన్నాడు. ఇంతలో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారడం.. రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గుముఖం పట్టడం.. ఫలితంగా నిర్మాణ రంగం ఆగమైంది. దీనికితోడు ఇసుకపై విపరీతమైన ఆంక్షలు విధించడంతో ఇండ్ల నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆరు నెలలుగా పనిలేక ఇబ్బందులు పడుతున్నాడు. అద్దెకు తీసుకుని నడిపిస్తున్న కార్పెంటర్ షెడ్డుకు అద్దె చెల్లించడం, పిల్లల చదువులకు ఫీజులు కట్టడం, కుటుంబాన్ని పోషించడం తలకు మించిన భారంగా మారింది. 2006లో ఊళ్లో పనిలేక బహరాన్, 2015లో సౌదీలో గడిపిన దేవేందర్.. ఆ తర్వాత సొంత ఊళ్లో పని ఉన్నదని 2017లో స్వగ్రామానికి చేరుకున్నాడు. 7 సంవత్సరాలు సంతోషంగా గడిపాడు. మళ్లీ ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో మస్కట్ బాట పడుతున్నాడు. భార్యాపిల్లలను విడిచి వెళ్లాలని లేకపోయినా వెళ్లక తప్పడం లేదని దేవేందర్ ఆవేదనగా తెలిపాడు.

దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో నేడు తీర్పు

ఐదుగురు నిందితులకు మరణశిక్షపై అప్పీల్

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా సం